క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

కడెం: 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కడెం, లింగాపూర్, బెల్లాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటలకు వరకు విద్యుత్ నిలిపివేస్తామని వినియోదారులు సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భా గంగా మండలంలోని మల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల సహకరించాలని కోరారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలకేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

మా సార్‌ను పంపించొద్దు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మా పాఠశాల ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి పంపించాలని మండలంలోని కుంసర గ్రామస్తులు కోరారు. శుక్రవారం కుంసర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ ఉపాధ్యాయుడిని సర్దుబాటులో భాగంగా వాలేగాం పాఠశాలకు పంపడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అజీంకు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపవద్దని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం అగ్ని మాపకశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు, అప్రమత్తత, నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రవి, సిబ్బంది సాయి ప్రసాద్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు మహిళ వైశ్యవారధి అధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేద కుటుంబాలను మహిళా వైశ్యవారధి ఆదుకుంటుందని సభ్యులు తెలిపారు.

ఎంపీడీవోగా రమాకాంత్



ఖానాపూర్: ఖానాపూర్ ఎంపీడీవోగా కె.రమాకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసే సునీత బదిలీపై పెంబి మండలానికి వెళ్లారు. పెంబి మండలంలో ఎంపీడీవోగా పని చేసిన రమాకాంత్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై ఖానాపూర్‌కు బదిలీ చేశా రు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీరు, సీసీ రోడ్లు, వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ నాయకులు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు రాజన్న, అనిల్, దిలీప్, శంకర్, లింగోజి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

లక్ష్మణచాంద: విద్యార్థులు నిత్యం పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యురాలు ఫర్జానా బేగం పేర్కొన్నారు. బాలశక్తి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. హెచ్ఎం రాజునాయక్, ఫార్మసిస్టు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

భవనం.. భయం భయం



తహసీల్దార్ గదికి వెళ్లే మార్గంలో వర్షానికి తడిసి కింద పడుతున్న కర్ర



కార్యాలయ ఆవరణలోకి వచ్చిన వర్షపునీరు



పెచ్చులూడుతున్న గోడ

- శిథిలావస్థకు చేరిన కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, పాలకులు

కడెం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధమైంది. పురాతన భవనం కావడంతో స్లాబ్‌కు సపోర్టుగా ఉన్న కర్రలు ఊడి మీద పడుతున్నాయి. ఇటీవలి వర్షాలకు తహసీల్దార్ చాంబర్ వెళ్లే దారిలో పైకప్పు కర్రలు ఊడి కిందపడ్డాయి.. భవనం సైతం మరింత దెబ్బతింది. సిబ్బంది భయం భయంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజలు సైతం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నూతన భవనం మంజూరు చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపినా.. ఇప్పటికీ మంజూరవలేదు.

బామ్ని(కే) ప్రాథమిక పాఠశాలలో..



తరగతి గదిలో వర్షపు నీరు

లోకేశ్వరం: మండలంలోని బామ్ని(కే) గ్రామ ప్రా థమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఐదు తరగతులకు 28 మంది విద్యార్థులున్నారు. భవనంలో ఉన్న ఐదు గదుల్లో మూడు శిథిలావస్థకు చేరాయి. మిగిలిన రెండు గదుల్లో ఒకటి స్టాఫ్ రూం కాగా.. ఒక్క గది, వరండాలోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే గదులు ఊరుస్తున్నాయి. పైకప్పు నుంచి వర్షపునీరు తరగతి గదుల్లో చేరుతుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు విన్నవించినా మ రమ్మతులు చేయించడం లేదని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు.




ఉరుస్తున్న పైకప్పు

జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఏటా వర్షాకాలం వచ్చిందంటే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలోని పలు విభాగాల్లో స్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా కన్పిస్తోంది. క్షేత్రస్థాయిలో శిథిల భవనాల యజమానులకు నోటీసులిచ్చి.. వాటిని తొలగించే మున్సిపల్ సిబ్బంది ఉన్న భవనాన్ని పట్టించుకునే వారు కరువయ్యారని అక్కడకు వచ్చే ప్రజలు చర్చించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



రెవెన్యూ విభాగంలో..



శానిటేషన్ విభాగంలో స్లాబ్‌పై పగుళ్లు



చైర్మన్ చాంబర్ ఎదుట స్లాబ్ దుస్థితి

బాధిత కుటుంబానికి సాయం

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన బాల రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి దాతలు సాయం అందిస్తున్నారు. మాజీ సర్పంచ్ మెరుగు ఇంద్రసేనారెడ్డి(ఎన్ఆర్ఐ) సమకూర్చిన రూ.5 వేలను గ్రామస్తులు సాయంగా అందించారు. గ్రామస్తులు మెరుగు రవీందర్‌రెడ్డి, తాళ్లపెల్లి రమేశ్, మల్లేశ్, నారాయణ, రమేశ్, రాజేందర్, శంకర్ శుక్రవారం నగదును బాధితులకు అందజేశారు.

వాహనాల తనిఖీ



పత్రాలు పరిశీలిస్తున్న ఏఎస్సై దేవన్న

కుంటాల: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై దేవన్న సూచించారు. శుక్రవారం మండలంలోని కల్లూరు 61వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. పెండింగ్ చలాన్ల జరిమానాలను మీ సేవ ద్వారా చెల్లించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఖానాపూర్: అటవీశాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేసే బేస్‌క్యాంపు సిబ్బంది, ఎనిమల్ ట్రాకర్స్, వాచర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారపాక స్వామి, నాగావత్ ఉపేందర్ మాట్లాడారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ప్రజాభిప్రాయానికే జనహిత యాత్ర

- కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి రాంభూపాల్



నిర్మల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలు, కొత్తగా అమలు చేసే పనులు, గత పాలకుల తప్పిదాలు ప్రజలకు తెలిపి, వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టారని పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంభూపాల్ అన్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం మాట్లాడారు. రాహుల్ గాంధీ దేశ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం బీసీ గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్ కల్పించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈనెల 3న సాయంత్రం ఐదు గంటలకు జనహిత పాదయాత్ర ఖానాపూర్ నియోజకవర్గంలోని బాదన్‌కుర్తికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ మీనాక్షి నటరాజన్ పార్టీ జెండా ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం సుర్జాపూర్, మస్కాపూర్ గ్రామాల మీదుగా ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వరకు చేరుకుంటారని తెలిపారు. మరుసటి రోజు ఉదయం 7 గంటల నుంచి 10.30 వరకు ఖానాపూర్ పట్టణంలో శ్రమదానం, 11 గంటలకు ముఖ్య కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం ఉంటుందని వివరించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ, నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది నాయకులు నాందేడపు చిన్ను, గంగ్రత్ ఈశ్వర్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్: జనహిత పాదయాత్రలో యువవత, అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సమరసింహారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఆత్రం రాహుల్ దేవ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అరకిల్ల పరమేశ్వర రావు, మండలాధ్యక్షుడు మోర్తాటి వంశీ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, అంజిత్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సంపూర్ణతా అభియాన్‌లో జిల్లాకు అవార్డు

- పెంబి బ్లాక్‌కు కాంస్యం
- నేడు గవర్నర్ చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్

పెంబి: ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా గిరిజన జనాభా ఎక్కువ ఉన్న పెంబి మండలం (బ్లాక్) అవార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. నీతి అయోగ్ నిర్వహించిన అభివృద్ధి ర్యాంకింగ్‌లో దేశంలోనే నాలుగో స్థానం పొందగా రాష్ట్రంలోని మూడో జోన్‌లో 2వ స్థానంలో నిలిచింది. సంపూర్ణత అభియాన్‌లో భాగంగా ప్రగతి సాధించినందున పెంబి మండలానికి కాంస్య పతకం దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాలులో జరిగే కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ అవార్డు అందుకోనున్నారు.

పాఠశాలలో తిలక్ వర్ధంతి

తానూరు(ముధోల్): ముధోల్ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర తిలక్ వర్ధంతి నిర్వహించారు. పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, భగవాన్‌దాస్, హెచ్ఎం సారథి రాజు, స్వప్న శర్మ తదితరులు ఉన్నారు.

వసతిగృహాల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి



కుంటాల: లింబా(బి)లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: నియోజకవర్గంలోని ఆయా సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో వసతిగృహాల వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు తరచుగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన లింగురాం శంకర్, ఓలా గ్రామానికి చెందిన లక్ష్మీ, కుంటాలకు చెందిన రాజారాం గజేందర్, జక్కుల శ్రీనివాస్, వేముల రాము, అందకూర్ గ్రామానికి బొండ రవి, కల్లూరు గ్రామానికి పసుల భారతి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ గజ్జారాం యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ నవీన్, నాయకులు అశోక్‌కుమార్, దత్తురాం పటేల్, గంగయ్య, ప్రభాకర్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

'నిర్మల్ ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి'

దిలావర్‌పూర్: జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు చేసిన ఘనత మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దేనని.. ఇకనైనా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని బన్సపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పి.వీ.రమణారెడ్డి అన్నారు. దిలావర్‌పూర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేర్కొన్నారు. ఇటీవల దిలావర్‌పూర్ మండలంలో మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించిన దిలావర్‌పూర్‌తండా నుంచి బన్సపల్లి వరకు బీటీ రోడ్డు పనులు, కాలతండా నుండి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు రోడ్డు పనులకు 2023లోనే ట్రైబల్ వెల్ఫేర్ నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. మహేశ్వర్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. ఇందులో నాయకులు పాల్దె శ్రీనివాస్, నార్వాడి సంభాజీరావు, పుజారం మహేశ్, కండెల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల రక్షణకే కార్డెన్‌సెర్చ్



పట్టుకున్న వాహనాల వద్ద పోలీస్ అధికారులు

ఖానాపూర్: శాంతిభద్రత పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని.. వీధుల్లో అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయం కాలనీ పరిధి నివాసాల్లో తనిఖీలు చేసి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 45 ద్విచక్రవాహనాలతోపాటు 4 ఆటోలు, కారును సీజ్ చేశామని సీఐ పేర్కొన్నారు. వాహనదారులు అన్ని విధాలా ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాహుల్ గైక్వాడ్, పలు మండలాల ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేసి.. విడతల వారిగా లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వీధుల్లో మురికి కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సాల్మన్‌రాజ్, కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

సాతే ఆశయ సాధనకు కృషి చేయాలి



తానూరు: జెండావిష్కరణలో పాల్గొన్న నేతలు

తానూరు: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న అన్నాభావు సాతే ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోసి గ్రామంలో అన్నాభావు సాతే 104వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సాతే చిత్రపటానికి నివాళులర్పించారు. సాతే స్ఫూర్తితో దళితులు ఉన్నత చదువులు చదవాలని పేర్కొన్నారు. ఆత్మ మాజీ చైర్మన్ పోతారెడ్డి, ఆనంద్, వీడీసీ అధ్యక్షుడు బాలాజీ, పండరి, సత్యనారాయణ, మనోహర్, సాయినాథ్, బాబు, శంకర్, లక్ష్మణ్, శ్రావణ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని అన్నాబావు సాతే భవనం వద్ద శుక్రవారం అన్నాబావు సాతే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రభాన్ గణపతి, విగ్రహ కమిటీ ఉపాధ్యక్షుడు దిగంబర్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యమిత్ర' సేవలు అభినందనీయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వదేశ్, తదితరులు

నిర్మల్‌ఖిల్లా: సామాజిక సేవారంగంలో 'ఆరోగ్యమిత్ర' స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు, ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. ఈ సంస్థ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం రజతోత్సవ గోడప్రతులు, కరపత్రాలను జిల్లా సైన్స్ అధికారి కె.వినోద్ కుమార్‌తో కలిసి జిల్లాకేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, యువత, పర్యావరణం, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాలు చేపడుతుండటం హర్షనీయమన్నారు. ఆరోగ్య మిత్ర జిల్లా అధ్యక్షురాలు చాట్ల గాయత్రి మాట్లాడుతూ కరోనా వేళ సంస్థ ఆధ్వర్యంలో 2,680 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి లక్షల మందికి హోమియోపతి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ యూత్ కన్వీనర్ పరికిపండ్ల సహజ, సామాజిక వేత్తలు మధుకర్, సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న డీఐఈవో పరశురాం నాయక్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో పరుశురాంనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. బోధన విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఐఐటీతోపాటు జేఈఈ, ఎప్‌సెట్, నీట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఆనందం, పలువురు అధ్యాపకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఖానాపూర్: ప్రభుత్వ పథకాల అమలుతోపాటు గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. అంతకుముందు మస్కాపూర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీవో రత్నాకర్‌రావు, సూపరింటెండెంట్ స్వామి, సిబ్బంది ఉన్నారు.

దోమలు పెరగకుండా చూడాలి

లక్ష్మణచాంద: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచి దోమలు పెరగకుండా చూడాలని ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పీచర గ్రామంలో డ్రై డే నిర్వహించారు. పలు ఇళ్లకు వెళ్లి పాత పాత్రల్లో నిల్వనీటిని పారబోయించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అల్లాడి వనజ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీచర్లకు ఫేస్ రికగ్నైజేషన్ ప్రారంభం

లక్ష్మణచాంద: ప్రభుత్వ ఉపాధ్యాయుల విధుల్లో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు నమోదుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం వడ్యాల్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ హాజరును ముఖ గుర్తింపు విధానం ద్వారా నమోదు చేసుకున్నారు. ఎంఈవో అశోక్ వర్మ పరిశీలించారు. సీఆర్పీ సుధాకర్ ఉన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయించొద్దు

లోకేశ్వరం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో గిరిరాజ్ ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారు నల్ల పోచమ్మ ఆలయంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్ తన సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అటవీ ప్రాంతంలో ఆలయం ఉండడంతో భక్తులతోపాటు ఆలయ రక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సంతోష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈశ్వరాచారి తదితరులు ఉన్నారు.

'ఆదర్శ' ప్రిన్సిపాల్‌గా రాజు

కుంటాల: కుంటాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎత్రాజ్ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన వి ద్య అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.